ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
3★★ జిల్లా వార్తలు
సోమవారం 6 అక్టోబరు 2025



జడ్పీ పీఠంపై గురి



- చైర్మన్ స్థానాన్ని దక్కించుకునేందుకు ప్రధాన పార్టీల వ్యూహరచన
- జనరల్ మహిళకు రిజర్వ్
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ తహతహ
- ఈసారి ఎలాగైనా పాగా వేయాలనే పట్టుదలతో కాంగ్రెస్
- రేసులో తాము సైతం అంటున్న బీజేపీ

జగిత్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పీఠాన్ని తమ ఖాతాలో వేసుకోవాలనే పట్టుదలతో ప్రధాన పార్టీలన్నీ వ్యూహరచన చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జడ్పీ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో అతివల్లో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో అత్యధిక ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను బీసీలకు కేటాయించారు. చైర్మన్ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో ఆయా పార్టీలు బలమైన నేతల కోసం గాలిస్తున్నాయి. తాజా రిజర్వేషన్ల ప్రకారం 20 మండలాల్లో 10 జడ్పీటీసీ స్థానాలను మహిళలకు కేటాయించారు. వీటితో పాటు జనరల్ స్థానాల్లోనూ మహిళలు పోటీ చేసే అవకాశాలు ఉండడంతో ఆ దిశగా పావులు కదుపుతున్నారు. జనరల్ స్థానాలతో పాటు ఆయా సామాజిక వర్గాల్లో మహిళలకు కేటాయించిన స్థానాల్లో ఏదో ఒక మండలం నుంచి పోటీ చేయించి జడ్పీ పీఠం దక్కించుకోవాలని ప్రధాన పార్టీలు ప్లాన్ వేస్తున్నాయి. పీఠంపై కన్నేసిన నేతలు ఒకరికి తెలియకుండా మరొకరు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.

● పోటీకి సై అంటున్న ముఖ్య నేతల సతీమణులు

జగిత్యాల జిల్లా పరిషత్ ఏర్పాటైన తర్వాత జరిగిన ఎన్నికల్లో జడ్పీ పీఠాన్ని బీఆర్ఎస్ దక్కించుకుంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో జడ్పీ పీఠాన్ని దక్కించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జిల్లా నుంచి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ప్పటికీ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని ప్రకటించారు. జిల్లాలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కొడిమ్యాల, మల్యాల మండలాలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రాతినిత్యం వహిస్తున్నారు. దీనికి తోడు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో తనదైన పట్టును కలిగియుండడం కాంగ్రెస్‌కు కలిసివస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో జడ్పీ పీఠం తమకే దక్కుతుందని కాంగ్రెస్ నేతలు ధీమాగా ఉన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ సిట్టింగ్ పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఎలాగైనా చైర్మన్ పదవిని సొంతం చేసుకోవాలని చూస్తోంది. బీజేపీ సైతం రేసులో తాము ఉన్నామన్న సంకేతాలను పంపుతోంది. జిల్లాలో 20 జడ్పీటీసీ, ఎంపీపీ, 216 ఎంపీటీసీ, 385 పంచాయతీలు, 3,536 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జడ్పీ పీఠం జనరల్ మహిళకు కేటాయించడంతో బరిలో నిలిచేందుకు ముఖ్య నేతల సతీమణులు ఆసక్తి కనబరుస్తున్నారు.

● పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్ ఆరాటం..

జిల్లా ఏర్పాటైన తర్వాత జడ్పీ పీఠాన్ని కేవసం చేసుకున్న బీఆర్ఎస్ మరోమారు పట్టు నిలుపుకోవాలనే ఆలోచనతో ఉంది. గత ఎన్నికల్లో మెజార్టీ జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకొని పీఠాన్ని దక్కించుకుంది. ఈసారి కూడా అదే పంథా కొనసాగించాలని చూస్తోంది. ఈ విషయమై జిల్లాకు చెందిన... - మిగతా 6లో

● కాంగ్రెస్‌లో ఆశావహులు అధికం..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఆ పార్టీలో పోటీ అధికమైంది. ప్రతి నియోజకవర్గం నుంచి పలువురు నేతలు పోరుకు సిద్ధమవుతున్నారు. జగిత్యాల నియోజక వర్గంలోని ఏదైనా ఒక మండలం నుంచి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి కుటుంబసభ్యుల్లో ఒకరు, కోరుట్ల నియోజక వర్గంలోని ఏదైనా ఒక మండలం నుంచి మాజీ మంత్రి, దివంగత జువ్వాడి రత్నాకర్‌రావు కుటుంబం నుంచి ఎవరైనా పోటీ పడే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగు తోంది. అధికార కాంగ్రెస్ పార్టీలో దాదాపుగా అన్ని మండలాల్లో అధిక సంఖ్యలో నేతలు పోటీకి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతి మండలం నుంచి ముగ్గురు నుంచి నలుగురు పేర్లతో ఆశా వహుల జాబితాను నేతలు అధిష్ఠానానికి అందించినట్లు చర్చలు జరుగుతున్నాయి.

కండ్లపల్లి చెరువు కట్ట మరమ్మతుకు చర్యలు

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి చెరువు కట్ట మరమ్మతుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఆదివారం జగిత్యాలకు చెందిన గంగపుత్రులు కలిసి చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని మరమ్మతులు చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కండ్లపల్లి చెరువు కట్ట పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కండ్లపల్లి చెరువు కట్ట మరమ్మతు కోసం రూ.27 లక్షల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపివేయడంతో కొంత మేర జాప్యం జరిగిందన్నారు. ఎస్ఈ, ఈఈలతో ఎమ్మెల్యే ఫోన్ లో మాట్లాడి చెరువుకట్ట పనులను త్వరితగతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయం ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్, అంజయ్య, రాజ్‌కుమార్, రాజేష్, రాజ్‌కుమార్, భూమయ్య, శేఖర్, ప్రవీణ్‌రావు, పవన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

భీమారం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు అమ్మమ్మ అయిల్నేని లలితమ్మ ఆదివారం మృతి చెందగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నాయకులు చెక్కపెల్లి సంజీవ్, సాగర్ రావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యూత్ సభ్యులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని బర్దిపూర్ యూత్ అధ్యక్షుడు బింకర్ అఖిల్ అన్నారు. మండలంలోని ఎర్దండి గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు అఖిల్, ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్‌కుమార్ హాజరయ్యారు. విజేతగా నిలిచిన శ్రీ మణికంఠ పౌల్ట్రీ ఫారమ్, కేశపూర్, రన్నర్‌గా నిలిచిన లగన్ టీం మూలరాంపూర్ టీంలకు బహుమతులు అందజేశారు. యువకులు క్రీడల్లో రాణించడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. యువతలో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. యువకులను దురాలవాట్లకు దూరంగా ఉండలని అఖిల్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బట్టు శేఖర్, ఆర్గనైజర్లు ప్రవీణ్, సికిందర్, మజ్ను, సుమన్, రవిరాజ్, సాయికుమార్, రవి పాల్గొన్నారు.

'హిందూ ఐక్యతే దేశ రక్షణకు పునాది'



ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

రాయికల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశ భక్తి, హిందూ ఐక్యతే దేశ రక్షణకు పునాది అని ఆర్ఎస్ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కొంగరి సాయికృష్ణ అన్నారు. ఆర్ఎస్ఎస్ రాయికల్ ఖండ ఆధ్వర్యంలో ఆదివారం శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఖండ కేంద్రంలో స్వయం సేవకులు పథ సంచలనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ వేల్పుల స్వామి యాదవ్, జిల్లా సహ శారీరక్ ప్రముఖ్ నూతికట్ల సత్యం, ఖండ బాధ్యులు దొంగ జితేందర్ రెడ్డి, కుర్మ మల్లారెడ్డి, తోపారపు రవీందర్, ఎద్దండి ముత్యం రాజు, తురగ రాజరెడ్డి, పాల్గొన్నారు.

●జగిత్యాల అగ్రికల్చర్: ఎంతో ఉన్నతమైన భారతీయ జీవన విధానమే నేడు ప్రపంచానికి ఆదర్శం అని జిల్లా ఆర్ఎస్ఎస్ జిల్లా సహ కార్యవాహ సాయి మధుకర్ అన్నారు. పట్టణంలోని గోవిందుపల్లె బస్తీ విజయదశమి ఉత్సవాన్ని ఆదివారం స్థానిక ఎల్‌జి గార్డెన్‌లో నిర్వహించారు.

●బీర్‌పూర్: మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బీర్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వొద్దిపర్తి సంతోష చార్యులు, మధు కుమార్ చార్యులు, గర్శకుర్తి రమేష్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●భీమారం: ఆపద సమయంలో ఆర్ఎస్ఎస్ ముందుంటుందని ప్రముఖ న్యాయ వాది నాయిని సంధ్య, జగిత్యాల జిల్లా ఆర్ఎస్ఎస్ సంఘ చాలకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గోవిందారం గ్రామంలో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. గోవిందారం, మోత్కు రావుపేట, రాజలింగంపేట, దేశాయిపేట, పసునూరు గ్రామానికి చెందిన స్వయం సేవకులు పాల్గొన్నారు.

●గొల్లపల్లి: గొల్లపల్లి మండలం మల్లన్న పేటలో శ్రీరాములపల్లె ఉప మండల్, మల్లన్న పేట గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రధాన వక్త, జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కొంగర సాయికృష్ణ జిల్లా సంపర్క్ ప్రముఖ్ బుదారపు శ్రీహరి, ఖండ కార్యవాహ కట్ట సుమన్ పాల్గొన్నారు.

జీవధార.. శ్రీరాంసాగర్

- దశాబ్దాలుగా కళకళలాడుతున్న ఎస్సారెస్పీ
- 47 ఏళ్లుగా ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో
- అత్యధికంగా 1983లో... అత్యల్పంగా 1987లో..

5

ప్రజావాణి రద్దు

● కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్ర మాన్ని యథావిధిగా కొనసాగిస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

'ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగుర వేస్తామని ఆయన జోస్యం చెప్పారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు విస్తృత సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యా సాగర్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజె క్టుతో కేసీఆర్ తెలంగాణను సస్యశ్యామలం చేశా రన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో గులాబీ జెండా ఎగరడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో మమేకమైన ఉద్యమ పార్టీ అని అన్నారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను బాకీ కార్డులు ఫ్లకార్డుల రూపంలో నాయ కులకు అందచేశారు. ఈ సమావేశంలో నియోజక వర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పం చులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు అన్నారు. కోరుట్ల నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కోరుట్ల నియోజకవర్గ నాయకులతో విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహుల నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చిట్నేని రఘు,జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్‌రెడ్డి, ధోనికెల నవీన్ బద్దం గంగాధర్ రెడ్డి, తుకారంగౌడ్, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు రాజు, వెంకటేష్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'అమృత్ 2.0'కు మోక్షమెప్పుడో..?



- రాయికల్ మున్సిపాలిటీకి రూ.15.20 కోట్ల నిధులు మంజూరు
- టెంటర్లు పూర్తయి ఏడాది గడిచినా ముందుకు సాగని పనులు
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాయికల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద రాయికల్ పట్టణ ప్రజలకు మంచినీటిని అందించేందుకు 2024 మే నెలలో రూ.15.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. పట్టణంలో అమృత్ పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్ ప్రక్రియ కూడా నిర్వహించింది. ఏడాది గడుస్తున్నా అమృత్ నిర్మాణ పనులకు మోక్షం కలగడం లేదు. రాయికల్ పట్టణం మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయింది. పట్టణంలో 12 వార్డులు ఉండగా 25 వేల జనాభా ఉంది. పట్టణంలో మొత్తం 5 వేల వరకు గృహాలు ఉండగా, ఇందులో 4,381 ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇంతవరకు నల్లా కనెక్షన్ లేనివారికి అమృత్ 2.0 కింద ఉచిత నల్లా కనెక్షన్లు ఇచ్చి మంచినీటిని సరఫరా చేయాల్సి ఉంది. కానీ అమృత్ పనులు ప్రారంభం కాకపోవడంతో కొత్త నల్లా కనెక్షన్లు ఎప్పుడు వస్తాయోనని పట్టణ ప్రజలు వేచి చూస్తున్నారు.

●ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా

పట్టణ ప్రజలకు ప్రస్తుతం నాలుగు ట్యాంక్‌ల ద్వారా నిత్యం అధికారులు ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని అందిస్తున్నారు. కోరుట్ల రోడ్డులో గల వాటర్ ట్యాంక్ నుంచి 250 కేఎల్, జీఎంఆర్ ట్రస్ట్ సమీపంలోని వాటర్ ట్యాంక్ ద్వారా 200 కేఎల్, ఒడ్డెర కాలనీ సమీపంలోని వాటర్ ట్యాంక్ ద్వారా 250 కేఎల్, వీరాపూర్ రోడ్డులో గల వాటర్ ట్యాంక్ నుంచి 90 కిలోలీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంక్‌ల నుంచి పట్టణ ప్రజలకు నిత్యం నీటి సరఫరా జరుగుతుంది. అయితే పెరిగిన జనాభాతో ఈ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అయితే అమృత్ 2.0 పథకం ప్రారంభమైతే పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

● చేపట్టాల్సిన పనులు..

అమృత్ 2.0 పనులు ప్రారంభమైతే 2.50 కిలోలీటర్ల నీటి సంపు, 15 కిలోమీటర్ల మంచినీటి పైపులైన్, 1600 కేఎల్ వాటర్ ట్యాంక్ నిర్మిస్తారు. అలాగే ఇప్పటి వరకు పట్టణంలో నల్లా కనెక్షన్ లేనివారికి ఈ పథకం ప్రారంభమైతే కొత్తగా కనెక్షన్ ఇస్తారు.

● భూ సమస్యే కారణం..

రాయికల్ పట్టణంలో అమృత్ 2.0పథకం పనులు భూ సమస్య కారణంగా ఇంతవరకు ప్రారంభం కాలేదు. అయితే పట్టణంలోని పలు ప్రాంతాల్లో అధికారులు అమృత్ పథక నిర్మాణానికి భూమిని పరిశీలించినా ఫలితం లేకుండా పోయింది. కానీ పట్టణ శివారులో ఎత్తైన ప్రాంతం లేకపోవడం ప్రస్తుతం ఇబ్బందికరంగా మారింది. గ్రావిటీ ద్వారా పట్టణం లోని మంచినీటి ట్యాంక్‌లకు అమృత్ ట్యాంక్ నుంచి నిత్యం నీటి సరఫరా జరగాల్సి ఉంటుంది. దీంతో అధికారులు అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నారు.

రైతుల నుంచి భూ సేకరణ చేశాం..



అమృత్ 2.0 పథకానికి రైతుల నుంచి భూ సేకరణ చేశాం. అక్విజిషన్‌కు ప్రకటన చేసి 60 రోజుల గడువు ముగిసింది. రైతుల నుంచి సేకరించిన భూమికి ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్ నుంచి లేదా అమృత్ పథకం నుంచి నగదును చెల్లించాలి. భూమిని ప్రభుత్వ అధీనంలోకి తీసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

- మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, "MOHAMMED MAQSOOD HAMED" S/O. LATE MOHAMMED ABDUL RAHIM, R/O. H.NO: 6-2-835/A/1, HUSSAINIPURA, KARIMNAGAR. I HAVE CHANGED NAME AS "MOHAMMED MAQSOOD AHMED" S/O. LATE MOHAMMED ABDUL RAHEEM.
AJK-17303

CHANGE OF NAME

★ I, "ZAKIR AHAMED KHAN" S/O. AHAMED HUSSAIN, R/O. H.NO: 8-58/A, LMD Colony, KARIMNAGAR. I HAVE CHANGED NAME AS "AQEEL AHMED" S/O. AHMED HUSSAIN.
AJK-250724

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా సమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

- యథేచ్ఛగా అడవులు, గుట్టలు విధ్వంసం...
- ఆహారం కోసం జనావాసాల్లోకి ఎలుగుబంట్లు, కోతులు, నెమళ్లు, అడవి పందులు
- నామమాత్రంగానే వన్యప్రాణి సంరక్షణ చర్యలు
- కొనసాగుతున్న జాతీయ వన్యప్రాణి సప్తాహం



ప్రశ్నార్థకంగా వన్యప్రాణుల మనుగడ

గుట్టలను, అడవులను ఆవాసాలుగా చేసుకుని జీవిస్తున్న వన్యప్రాణులకు రక్షణ లేకుండా పో యింది. గుట్టల ధ్వంసం, అడవుల నరికివేత, మరో వైపున వేటగాళ్ళ ముప్పుతో వ్యన్యప్రాణులు సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతున్నది. కొన్ని అరు దైన జాతుల పక్షులు, జంతువులు దాదాపు అంత రించిపోయే స్థితికి చేరుకున్నాయి. అక్టోబరు 2 నుంచి 8 వరకు జాతీయ వన్యప్రాణి సప్తాహం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని వన్యప్రాణులపై కథనం..

- కరీంనగర్ క్రైం, (ఆంధ్రజ్యోతి)

వన్యప్రాణులు, వనాలను రక్షించుకోవాలంటూ ప్రతి సంవత్సరం అక్టోబరు రెండు ఉంచి వారం రోజుల పాటు వన్య ప్రాణుల సంరక్షణ వారోత్స వాల పేరిట అధికారులు ర్యాలీలు, విద్యార్థులకు క్విజ్ పోటీలతో సరిపెడుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు నిర్ధిష్టంగా చేపట్టాల్సిన బాధ్యతలను మాత్రం విస్మరిస్తున్నారు. రోజు రోజుకు వనాలు నరికివేస్తుండడంతో పక్షులు, అటవీ జంతువులు వాటి ఆవాసాలను కోల్పోతున్నాయి. సహజసి ద్ధంగా లభించే ఆహారం దొరకని పరిస్థితి నెలకొ న్నది. అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరగాల్సిన వన్యప్రాణులకు నీరు, ఆహారం లభించక జనావా సాల్లోకి ప్రవేశించి ప్రాణాలు కోల్పోతున్నాయి.

● తీవ్రమైన కోతుల బెడద

కరీంనగర్ జిల్లాలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల హుజురాబాద్‌లో కోతులదాడిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వందలాది మందిపై దాడి చేసి గాయపరిచాయి. అడవి పందులు గ్రామాల్లో పంటపొలాల్లోకి వెళ్లి చేతికివచ్చిన పం టలు మొక్కజొన్న, పల్లికాయ, పెసర, పొద్దు తిరుగుడు, పత్తికాయలను తినేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో వన్యప్రాణుల వేట జోరుగా సాగుతున్నది. కొంతకాలం క్రితం మంథని ప్రాంతంలో హైదరా బాద్‌కు చెందిన నలుగురు జింకలను వేటాడి వెళ తుండగా పోలీసులకు చిక్కారు. వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్) యాక్ట్ 1972 ప్రకారం అడవి జంతు వులను చంపిన వారికి కఠిన శిక్షలున్నప్పటికీ ఆ యాక్ట్‌ను అమలు చేయడంలో అధికారులు విఫల మవుతున్నారు.

● ఉమ్మడి జిల్లాకు వరంగల్ రెస్క్యూ టీమే దిక్కు

అటవీ జంతువులు దారి తప్పి జనావాసాలకు చేరితే వాటిని బంధించి సురక్షితంగా అడవికి చే ర్చాలి. ప్రాణాంతకమైన జంతువులైతే సంబం ధిత అటవీశాఖ అధికారులు వెంటనే అటవీశాఖకు చెందిన సెంట్రల్ రెస్క్యూ టీంలకు సమాచారం అందించాలి. హైదరాబాద్ జూ లేదా వరంగల్ నుంచి రెస్క్యూటీం సంఘటనా స్థలానికి చేరుకుని మత్తు ఇంజక్షన్ల ద్వారా ఆ జంతువులను బంధించి తిరిగి సురక్షితంగా అటవీ పాంతంలో వదిలి వేయాలి. హైదరాబాద్ లేదా వరంగల్ నుంచి రెస్క్యూ టీం రావడానికి చాలా సమయం పడు తోంది. అప్పటి వరకు జరగాల్సిన నష్టం జరిగిపో తోంది. ఉమ్మడి జిల్లాకు ఒక ట్యాంకిలైజర్ గన్, ట్రాపర్ వెహికల్, రెస్క్యూటీం ఉండాలని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాటిని ఎవరూ పట్టించుకోలేదు.

● భల్లూకాల ఆవాసాలు ఛిద్రం....

ఎలుగుబంట్లు సాధారణంగా అటవీ ప్రాంతంలో సంచరించి చెట్ల ఫలాలు, తేనె, చీమలు, వివిధ రకాల పురుగులను, మట్టిలో ఉండే పలు రకాల దుంపలను ఆహారంగా తీసుకుంటాయి. కరీంనగర్ జిల్లాలో తరచుగా ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. పలుసార్లు కరీంనగర్ జిల్లా కేంద్రంలోనూ ఎలుగుబంట్లు సంచరించడం నగరవాసులను ఆందోళనకు గురి చేస్తోంది. కరీంనగర్ పరిసరాల్లోని గుట్టల్లో ఎలుగుబంట్లు వందల సంఖ్యలో స్థావరాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. గ్రానైట్ క్వారీల ఏర్పాటుతో వాటి ఆవాసాలు ధ్వంసమవుతున్నాయి. గుట్టల్లో నిత్యం పేలుళ్లు జరపడంతో ఎలుగుబంట్లు జనావాసాల్లోకి చొరబడి అడ్డువచ్చిన వారిపై దాడులు చేస్తున్నాయి.



చాలా సందర్భాల్లో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు ఎలుగుబంట్ల దాడిలో గాయపడుతున్నారు. మరో వైపు అటవీ ప్రాంతం, గుట్టలలోని స్థావరాలను వదిలి గ్రామాల్లోకి వస్తున్న ఎలుగుబంట్లు, నెమళ్లు, జింకలు, తదితర వన్యప్రాణులు ప్రమాదాల బారిన పడి, కొన్ని సందర్భాల్లో ప్రజల చేతిలో ప్రాణాలు కోల్పోతున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ నాంపల్లి సతీష్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన వీర్నపల్లి మండలం అడవిపదిరలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. సతీష్ పదేళ్లుగా ఆటో నడుపు తూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో కొనుగోలు, కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.6లక్షలు అప్పులుచేశాడు. ఆటోవల్ల ఉపాధి అంతంతా మాత్ర మే కావడంతో ఓవైపు బాకీల బాధలు.. మరోవైపు పోషణ తలకు మించిన భారంగా మారింది. దీంతో మనస్థాపం చెందిన సతీష్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. విషయం తెలుసుకున్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య చేరుకుని ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఆయనవెంట ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, సాగర్, భాస్కర్, తిరుపతి, దేవరాజు ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికిచెందిన కోల సతీష్(38) మద్యానికిబానిసై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్ బతుకుదెరువు కోసం నాలుగేళ్ల కిందట గల్ఫ్‌దేశం వెళ్లి తిరిగివచ్చాడు. అప్పటినుంచి పనిదొరకక ఖాళీగాఉంటూ మద్యానికి బానిస య్యాడు. దీంతో ఆర్థికసమస్యలు మొదలై మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని సతీష్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

యువకుడిపై దాడి

కోరుట్ల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో శనివారం అర్ధరాత్రి దుంపేట రాజేష్ అనే యువకుడిపై తలారి వినయ్ అనేవ్యక్తి బీరుసీసాతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం తలారి వినయ్, దుంపేట రాజేష్‌లు మద్యం సేవిస్తున్న క్రమంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజేష్‌ను వినయ్‌చేతిలో ఉన్న బీర్‌సీసాతో దాడి చేయడంతో మెడ ప్రాంతంలో తీవ్రగాయం కాగా స్థానికులు చికిత్స నిమిత్తం కోరుట్ల పట్టణంలోని ఓ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. పరిస్థతి విషమంగా ఉండడంతో రాజేష్‌ను కోరుట్ల నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుప్రతికి తరలించారు. కాగా రాజేష్, వినయ్ మధ్య పాతపగలు ఉన్నట్లుబంధువులు పేర్కొంటున్నారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేస్తున్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట డీజీపీ శివధర్‌రెడ్డిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదారాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీగా శివధర్‌రెడ్డి బాధ్య తలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పుష్పగుచ్ఛం అందజేసి శుభా కాంక్షలు తెలిపారు.



డీజీపీ శివధర్ రెడ్డితో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

'సర్దుబాటు'పై లోకాయుక్తను ఆశ్రయించిన ఉపాధ్యాయుడు

● 10న హాజరుకావాలంటూ డీఈవోకు నోటీసు జారీ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి చేపట్టిన సర్దుబాటు బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఓ ఉపాధ్యాయుడు లోకాయుక్తను ఆశ్రయించాడు. సర్దుబాటు కోసం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇచ్చిన నిబంధనలకు విరుద్ధంగా తనపై కక్ష సాధింపుతో బదిలీ చేశారని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వఉన్నతపాఠశాల ధన్గర్‌వాడీ లో పనిచేస్తున్న స్కూల్‌అసిస్టెంట్ హిందిపండిట్ ఎండీ జావీద్‌హుస్సేన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ తప్పును సవరించాలని డీఈవోను కోరినా న్యాయం జరుగక పోవడంతో గత్యంతరం లేక లోకాయుక్తను ఆశ్రయించానన్నారు. జూన్18న జిల్లావిద్యాశాఖ అధి కారి చేపట్టిన టీచర్ల సర్దుబాటులో తనకంటే జూని యర్ పాఠశాలలో ఉండగా తనను సర్దుబాటులో బదిలీచేశారని తెలిపారు. విద్యార్థులసంఖ్యను పరిశీ లించి బదిలీ చేయాల్సి ఉండగా దాన్ని పట్టించుకోలే దని, జూనియర్‌ను బదిలీ చేయకుండా తనను బదిలీ ఎలా చేస్తారని అన్నారు. దీనిపై జిల్లావిద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించినా పట్టించుకోలేద ని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాను జూలై 22న లోకాయుక్తను ఆశ్రయించి ఫిర్యాదు చేశానని, దీనిపై స్పందించిన లోకాయుక్త ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు తన కార్యాలయంలో హాజరుకావాలంటూ జిల్లా విద్యాధికారికి, తనకు నోటీసు జారీ చేసిందని చెప్పారు. రెండోసారి చేపట్టిన సర్దుబాటులో మళ్లీ తనకంటే జూనియర్ ఉన్నప్పటికీ తనను మరోసారి వేరే పాఠశాలకు సర్దుబాటు నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారన్నారు. శనివారం తనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రిలీవ్‌చేశారని, తనకు రెండో సారికూడా అన్యాయం చేశారని ఆవేదనవ్యక్తం చేశా రు. లోకాయుక్తలో తనకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని, జిల్లా విద్యాశాఖ అధికారులు డీఎస్ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇలా సర్దుబాటులో అనేకమంది ఉపాధ్యాయులకు అన్యా యం చేస్తున్నారన్నారు. వీటన్నింటిపై విచారణ జరి పించి, నిబంధనల మేరకు సర్దుబాటు జరిగేలా లోకా యుక్త, డైరెక్టర్‌ఆఫ్‌స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు న్యాయం చేయాల్సిన అవసరముందని, నిబంధనలు పాటించని అధికారులపైచర్యలుతీసుకోవాలని కోరారు.

గంజాయి స్వాధీనం

● ఇద్దరు యువకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు కారం శ్యాంకుమార్, రేసు అక్షయ్‌ను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి 160గ్రాముల ఎండు గంజాయిని స్వాధీ నపర్చుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆది వారం తెలిపారు. తాము గస్తీకాస్తున్న క్రమంలో ఇద్దరు యువకులు అనుమానా స్పదంగా కనిపిండచంతో అదుపులోకి తీసు కున్నామన్నారు. వారిని విచారించగా హైద రాబాద్‌లో గంజాయిని తక్కువ ధరను కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకు వచ్చారని చెప్పారు. వారివద్ద నుంచి గంజాయిని స్వాధీనపర్చుకుని కేసునమోదు చేసి అరెస్ట్ చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

చెరువులో పడి యువకుడి మృతి

జమ్మికుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన ఫీట్ల రాజశేఖర్(28) అనే యువకుడు చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో పడి ఆదివారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్ పదిసంవత్సరాలుగా ఫిట్స్, అనారోగ్యసమస్యలతో బాధపడుతున్నాడు. మధ్యాహ్నం 12గంటల సమయంలో గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఫిట్స్‌రావడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డా డు. ఈమేరకు మృతుడితల్లి కేశమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి

రామగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూర్ గ్రామానికి చెందిన చిందం శారద(38) అనేవివాహిత జ్వరంతో ఆది వారం మృతి చెందింది. పదిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న శారద కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. జ్వరంతోపాటు ఇన్ఫెక్షన్ సోకడంతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపి నట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతురాలి భర్త గ్రామపంచాయ తీలో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. శారద మృతిపై కుమార్‌యాదవ్, చిందం మహేష్, దామెర శ్రీనివాస్, మురళీకృష్ణ, ముత్యాల శ్రీనివాస్, పంజాలశ్రీనివాస్‌లు పెరు మాండ్ల ప్రసాద్, కుంట సమ్మయ్యలు సంతాపం తెలిపారు.



శారద(ఫైల్)

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన గంట వెంకటేశ్వర్‌రెడ్డి(82) ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వెంకటేశ్వర్‌రెడ్డి సింగ రేణిలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యాడు. కొంత కాలంగా మానసికస్థితి బాగా లేకపోవడంతో ఆదివారం తెల్లవారుజామున ఇంటిపై నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఆయన తలకు బలమైన గాయం కాగా గోదావరిఖని ప్రభు త్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు గంట శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేశ్వర్‌రెడ్డి(ఫైల్)

వివాహిత అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండల పరిధి లోని విద్యారణ్యపురిలో నివాసం ఉంటున్న సిరిపురం చంద్రకళ (35) అనేవివాహిత ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతిచెం దింది. ఆదిలాబాద్‌కు చెందిన సంతోష్‌కు ఊట్నూర్‌కుచెందిన చంద్రకళతో కొంతకాలం కిందట వివాహమైంది. అనంతరం భార్యా భర్తల మధ్యగొడవలు తలెత్తాయి. ప్రస్తుతం వారు విద్యారణ్యపురిలో కొడుకుతో కలిసి నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం చంద్రకళకు ఫిట్స్‌వచ్చాయి. ఆస్ప త్రికి తీసుకెళ్లగా గుండెపోటుతో మరణించిందని వైద్యులు వెల్లడించారు. తన కూతురు మరణంపై అనుమానం ఉందని మృతురాలి తండ్రి పోలీ సులకు ఇచ్చిన ఫిర్యాదులోపేర్కొన్నాడు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



చంద్రకళ(ఫైల్)

అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడు గట్టయ్య మృతి

శంకరపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ గ్రామానికిచెందిన తెలంగాణ ఉద్యమకారుడు సుంకరి గట్టయ్య(70) ఆది వారం అనారోగ్యంతో మృతిచెందాడు. సుంకరి గట్టయ్య తెలంగాణ ఉద్యమసమయంలో 360రోజులు తెలంగాణకొరకు తాడికల్ దీక్ష శిబి రంలో నిరసన దీక్షలో పాల్గొన్నారు. అంతేకాకుండా రాస్తారోకోలు, ధర్నా లో పాల్గొని యువతలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు



ఈదులగట్టెపల్లి-ఖాదర్‌గూడెం గ్రామాల మధ్య ఉన్న ఇరుకు వంతెన

మానకొండూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మా నకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి- ఖాదర్ గూడెం గ్రామాల మధ్య నుంచి వెళుతున్న కాకతీయ ప్రధానకాల్వపై నిర్మించిన వంతెన ఇరుకుగా ఉండడ ంతో ఆయాగ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ప డుతున్నారు. ఈ వంతెన పైనుంచి రెండు గ్రామాల కు చెందిన రైతులు పండించిన ధాన్యాన్ని ఇళ్లకు తీసుకెళుతుంటారు. సుమారు 45ఏళ్ల క్రితం కాకతీ య కాల్వ నిర్మాణంలో రెండు గ్రామాల ప్రజలు వె ళ్లేందుకు ఈ వంతెనను నిర్మించారు. ఈ వంతెనపై ఎడ్లబండి, ద్విచక్ర వాహనాలు మినహా మరే ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వంతెన శిథి లావస్థకు చేరుకోవడమే కాకుండా ఇరుకుగా ఉండ డంతో ఉపయోగం లేకుండా పోయిందని ఆయాగ్రా మాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్ర తినిధులు, అధికారులు స్పందించి రెండు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా నూతన వంతెన ను నిర్మించాలని కోరుతున్నారు.

విస్తరణకు నోచుకోని అయిలాపూర్ రహదారి

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అయిలాపూర్ రోడ్డు

కోరుట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డు విస్తరణలో తీవ్రజాప్యం చోటుచేసుకుంటోంది. దీంతో వాహన దారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 30 సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసినా పనులు ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వహయాంలో ఆదిలాబాద్ నుంచి మొదలై కోరుట్ల పట్టణంలోని అయిలపూర్ రోడ్డు మీదుగా వేములవాడ రహదారిని కలు పుతూ వేములవాడ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను చేపట్టారు. డబుల్ రోడ్డు నిర్మాణం కోసం అయిలాపూర్ రోడ్డులోని నివాసాలతోపాటు వ్యాపా రులకు రాష్ట రోడ్డు భవనాల శాఖ నుంచి నోటీసు లను జారీచేశారు. కానీ విస్తర్ణ పనులు మాత్రం మొదలు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణపై చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● రోడ్డు విస్తరణపై దృష్టి సారించాలి..

- సుదవేణి మహేష్, బీజేపీ నాయకుడు, కోరుట్ల



అయిలాపూర్ రోడ్డును విస్తరణ చేసి అభివృద్ధిపర చాలి. నిత్యం రద్దీగా ఉండే రహదారిని విస్తీర్ణం చేసి ట్రాఫిక్ సమస్యలను పరి ష్కరించాలి. 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహ దారి విస్తర్ణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

బావిలో పడి ఒకరి మృతి

మల్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పంప్‌మోటార్ మరమ్మతులు చేస్తుండగా మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన ఊకంటి శ్రీపాల్‌రెడ్డి(47) అనే ఎలక్ట్రీషియన్ ఆదివారం బావిలోపడి మృతిచెందాడు. గ్రామానికిచెందిన మిర్యాల అవంతికిచెందిన వ్యవ సాయబావి పంప్‌మోటార్ మరమ్మతుకోసం బావి వద్దకు శ్రీపాల్‌రెడ్డివెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవ శాత్తు కాలుజారి పక్కనేగల బావిలోపడి మృతిచెం దాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

ధర్మపురి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పెద్ద నక్కలపేట గ్రామానికి చెందిన బగ్గి లక్ష్మి(50) అనేమహిళ కారు ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం సాయంత్రం మృతిచెందింది. వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న లక్ష్మిని ధర్మపురి నుంచి బీర్పూర్ వైపు వెళుతున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని చికిత్స కోసం అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో ఆదివారం ఉరి వేసుకొని గుండెపల్లి పద్మ(50) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లాకు చెందిన గుండెపల్లి పద్మ(50) రెండు సంవత్సరాల క్రితం వెల్లుల్ల గ్రామానికి వలస వచ్చింది. గ్రామంలో ఒంటరిగా ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆదివారం పద్మ ఉంటున్న ఇంటి తలుపులు మూసి ఉండడంతో స్థానికులు తెరిచి చూడగా ఇంటిలో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరిశీలించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిత్రకారుడిగా రాణిస్తున్న గాజుల నవీన్

● ఎవరి చిత్రమైన అవలీలగా వేయగల దిట్ట

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాజుల నవీన్ చిత్రకారుడిగా ఎదిగి ఎన్నో అద్భుతమైన బొమ్మలు గీశాడు. సీనరీ, వ్యక్తి బొమ్మ చూసినా అవలీలగా వేయగల దిట్ట. ఇంటర్‌తోపాటు డ్రాయింగ్‌లో టీటీసీ చేసిన నవీన్ రకరకాలుగా బొమ్మలు గీసి అబ్బుర పరుస్తున్నాడు. కొందరు తమ ముఖచిత్రాలను నవీన్ ద్వారా గీయించుకొని పారితోషకం కూడా ఇస్తున్నారు. ఎవరి వద్ద శిక్షణ లేకుండానే బొమ్మలు వేయడంలో నైపుణ్యం సాధించాడు. కొందరు ఆర్టిస్టులు పెయింట్స్‌తో మాత్రమే బొమ్మలను వేస్తే, నవీన్ మాత్రం పెన్సిల్, కార్బన్, వుడ్ బర్నింగ్, థ్రెడ్ తదితర వాటి ద్వారా వివిధ రకాల బొమ్మలను గీస్తున్నాడు. అలాగే బర్నింగ్ ఆర్ట్‌తో బొమ్మ వేసి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు అందజేసి అభినందనలు చూరగొన్నారు. పలు రకాల బొమ్మలను వేయడంలో ఆరితేరిన నవీన్, ఎవరికైనా బొమ్మలు వేయించుకోవాలంటే తనను సంప్రదించాలని పేర్కొంటున్నాడు.



ఆంజనేయుని చిత్రపటాన్ని కరీంనగర్ కలెక్టర్‌కు అందజేస్తున్న నవీన్



తాను వేసిన చిత్రాలు చూపిస్తున్న నవీన్

స్వతహాగా బొమ్మలు వేయడం నేర్చుకున్నా

- గాజుల నవీన్, కాల్వశ్రీరాంపూర్



స్వతహాగానే బొమ్మలు వేయడం నేర్చుకున్నాను. ఇంటర్ తర్వాత డ్రాయింగ్‌లో టీటీసీ చేశాను. పెన్సిల్‌తోగాని, దారం, చెక్కతో కూడా బొమ్మలు వేస్తాను.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ఆయాదేవాలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయం పక్షాన ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

● కొండగట్టులో భక్తుల ఇక్కట్లు

మల్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధికి వచ్చే భక్తులసౌకర్యార్థం భక్తులసేవాసమితి ఆధ్వర్యంలో వాహన పూజషెడ్డుకు సమీపంలో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. పనులు పూర్తై నెలలు గడుస్తున్నప్పటికీ ప్రారంభించడం లేదని వెంటనే మరుగుదొడ్లను ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.



కొండగట్టుపైన గల మరుగుదొడ్లు



జీవధార.. శ్రీరాంసాగర్

- దశాబ్దాలుగా కళకళలాడుతున్న ఎస్సారెస్పీ
- 47 ఏళ్లుగా ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో
- అత్యధికంగా 1983లో... అత్యల్పంగా 1987లో..

జగిత్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దశాబ్దాలుగా నీటితో కళకళలాడుతోంది. 47 ఏళ్ల ప్రాజెక్టు చరిత్రలో రెండేళ్లు మాత్రమే అతి స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1983 నుంచి వరదలు ప్రారంభ మయ్యాయి. గడిచిన 47 ఏళ్లలో 10 సంవత్సరాలు మాత్రమే స్వల్పంగా వరద నీరు వచ్చి చేరింది. 1987, 2015 సంవత్సరాల్లో మాత్రమే ప్రాజెక్టు నీటి మట్టం డెడ్ స్టోరేజీ (5 టీఎంసీలు) కన్నా తక్కువ నీటి మట్టానికి పడిపోయింది. కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏడాది ప్రాజెక్టు నిండుకుండలా మారుతుండగా మిగులు జలాలు దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1983 నుంచి వరదలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 సంవత్సరాలు మాత్రమే ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కన్నా తక్కువ ఇన్‌ఫ్లో వచ్చింది. 1985-86లో 85.64 టీఎంసీలు, 1987-88లో 4.4 టీఎంసీలు, 1992-93లో 58.74 టీఎంసీలు, 2003-04లో 54.02 టీఎంసీలు, 2004-05లో 19.07 టీఎంసీలు, 2019-10లో 27.34 టీఎంసీలు, 2010-11లో 27.53 టీఎంసీలు, 2012-13లో 54.37 టీఎంసీలు, 2014-15లో 14.77 టీఎంసీలు, 2015-16లో 4.42 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

కాలువలు, ఎత్తిపోతలు	విడుదల చేసిన నీరు (టీఎంసీలలో)
కాకతీయ కాలువ	21.15
సరస్వతీ కాలువ	2.088
లక్ష్మీ కాలువ	0.458
వరద గేట్ల ద్వారా	647.509
ఎస్కేప్ గేట్ల ద్వారా	15.382
ఆవిరి	5.064
అలీసాగర్ ఎత్తిపోతల పథకం	0.521
గుత్పా ఎత్తిపోతల పథకం	0.255
మిషన్ భగీరథ	2.515
వరద కాలువ	50.548
మొత్తం అవుట్ ఫ్లో	**745.49**

● 1983లో 1,165టీఎంసీలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 1983 సంవత్సరంలో వరద నీరు వచ్చి చేరింది. ఆ సంవత్సరంలో 1,165 టీఎంసీల వరద నీరు డ్యామ్‌లోకి వచ్చింది. దీంతో వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. అత్యల్పంగా 1987 సంవత్సరంలో 4.4 టీఎంసీలు, 2015 సంవ త్సరంలో 4.42 టీఎంసీల నీరు వచ్చింది. డ్యామ్‌లోకి అత్యధికంగా 1988-89 సంవత్సరంలో 912.95 టీఎం సీలు, 1989-90 సంవత్సరంలో 576.28 టీఎంసీలు, 1990-91లో 687.69 టీఎంసీలు, 1998-99లో 552.44 టీఎంసీలు, 2005- 06లో 374.42 టీఎంసీలు, 2006-07లో 515.48 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

● శ్రీరాంసాగర్‌కు 1.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 37 గేట్లు ఎత్తి 1.5లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదిలారు.



(2025 అక్టోబరు 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు)

నెలలు	వచ్చిన వరద (టీఎంసీలలో)	విడుదల చేసింది
జూన్	4.485	1.602
జూలై	24.488	1.749
ఆగస్టు	249.617	222.16
సెప్టెంబరు	425.614	434.837
అక్టోబరు	108.552	85.143
మొత్తం	**812.755**	**745.49**

● ప్రస్తుత యేడాది 812.755 టీఎంసీల నీరు రాక

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద ప్రస్తుత సీజన్‌లో పోటెత్తింది. డ్యామ్‌లోకి ప్రస్తుతం భారీగా వరద నీరు వస్తోంది. దీంతో కొన్ని రోజులుగా వరద గేట్లు పైకి ఎత్తి దిగువ గోదావరిలోకి నీటిని భారీగా వదులుతున్నారు. రికార్డు స్థాయిలో దిగువకు మిగులు జలాలు విడుదల చేస్తున్నారు. కాల్వలు, ఎత్తిపోతల ద్వారా పంటల కోసం నీటిని వదులుతున్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు ఎగువ నుంచి ఏకంగా 812.755 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అవసరమైన నీటి మట్టాన్ని నిల్వ చేస్తూ కాలువలు, ఎస్కేప్, వరద గేట్ల ద్వారా 745.49 టీఎంసీల నీరు విడుదల చేశారు. ఇందులో వరద గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి 647.509 టీఎంసీల నీరు వదిలారు. ప్రస్తుతం డ్యామ్‌లో 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పండుగ ముగిసే.. పట్నం పిలిచే..

● రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ



రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల తాకిడి

తిమ్మాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు చేసుకునేందుకు సెలవులపై సొంత గ్రామాలకు హైదారాబాద్ నుంచి వచ్చిన జనాలు తిరిగి సెలవులు ముగియడంతో సోమవారం విధులకు, పాఠశాలలకు, కళాశాలలకు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అందరు ఆదివారం పల్లెల నుంచి పట్నంబాట పట్టారు. దీంతో మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ పెరిగింది. దీంతో టోల్‌గేట్ వద్ద కరీంనగర్‌నుంచి హైదారాబాద్ వైపువెళ్లే వాహనాలు క్యూకట్టాయి. దీంతో వాహనాలు సుమారు కిలోమీటర్ మేరా క్యూలో నిలబడి మెల్లిగా వెలుతుండటంతో ప్రయాణికులు కొద్దిగా ఇబ్బందిపడ్డారు. టోల్‌గేట్ సిబ్బంది కూడా వాహనాలను త్వరగా పంపించేందుకు శ్రమించారు.

● మొరాయించిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు..

మండలంలోని రేణికుంట వద్ద టోల్‌గేట్‌కు సమీపంలో కరీంనగర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ ఎలక్ట్రికల్‌బస్సు ఆదివారం ఉదయం మొరాయించింది. కరీంనగర్ నుంచి ప్రయాణికులతో సికింద్రాబాద్ బయలుదేరిన బస్సు టోల్‌గేట్ సమీపంలోకి చేరుకోగానే ఆగిపోయింది. ఎంతసేపటికీ స్టార్ట్ కాక పోవడంతో అందులోని ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. చివరికివేరే బస్సును రప్పించి ప్రయాణికులను అందులో సికింద్రాబాద్‌కు పంపించారు.



నిలిచిపోయిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు

'కందేపి'కి గాంధీ ఇన్‌స్పిరేషనల్ జాతీయ పురస్కారం ప్రదానం



పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ రాణిప్రసాద్

సిరిసిల్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ జాతీయస్థాయిలో గాంధీ ఇన్‌స్పిరేషనల్ పురస్కారం అందుకున్నారు. ఆదివారం పాన్ ఇండియా సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా హైదరాబాదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ రాణిప్రసాద్‌కు గాంధీ ఇన్‌స్పిరేషనల్ జాతీయ పురస్కారాన్ని శాసన సభ మాజీస్పీకర్ మధుసూదనాచారి అందజేశారు. రాణి ప్రసాద్ పురస్కారం అందుకోవడంపై జిల్లా రచయితల సంఘం, మానేరు రచయితల సంఘం, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని రాణిప్రసాద్ 75చిత్రాలను తయారుచేశారు. అందులో స్వాతంత్రోద్యమ కవితలు, అమరవీరుల చిత్రాలు, జాతీయ పతాకాలు, భారతదేశ చిత్రపటాలను తయారుచేసి రెండు ఎగ్జిబిషన్‌లు నిర్వహించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతోఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే సామివారిని దర్శించుకున్నారు.



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మైసమ్మ తల్లికి పూజలు

సుభాష్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మైసమ్మతల్లికి ఉమ్మడిజిల్లా నాలుగోతరగతి ఉద్యోగులసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి మాట్లాడుతూ మైసమ్మతల్లి దయ అందరిపై ఉండాలన్నారు. 20సంవత్సరాలుగా నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడిజిల్లా కార్యదర్శి శంకరయ్య, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రమేశ్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కె.అరుణ, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు జీవన్, నగర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, హుజురాబాద్ తాలూకా అధ్యక్షుడు కె.రమేశ్, సహాధ్యక్షుడు కె.సోమయ్య, కోశాధికారి లక్ష్మిరాజం, ఉపాధ్యక్షులు రాజలింగం, ఎం.అశోక్, సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, జె.రవీందర్ రిటైర్డ్ నాకులు, జిల్లా, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

● గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ

భగత్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కల్లు గీతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. చెట్టుపై నుంచిపడి మరణించిన, గాయాలపాలైన కార్మికులకు ఇస్తామన్న ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశీయ వస్తువులనే వాడాలని చెబుతున్నా నీరా, కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతిగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి వెంకటనరసయ్య, సురుగు రాజేష్, జగిత్యాల జిల్లా కన్వీనర్ గర్వందుల రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ

ఆండాళమ్మకు ఒడి బియ్యం సమర్పణ

● గజవాహనంపై శ్రీవారి ఊరేగింపు



ఒడి బియ్యం సమర్పించిన పద్మశాలి సంఘం మహిళలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టణానికి చెందిన పలువురు దంపతులు దేవాలయంలో ఆండాళమ్మ(పద్మావతి)కు ఒడి బియ్యం సమర్పించారు. పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం పట్టణప్రధాన రహదారుల గుండా శ్రీవారు గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతిరావు, అర్చకులు మాడంరాజు కృష్ణమాచార్యులు, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పద్మశాలి సంఘం పట్టణ మహిళా అధ్యక్షురాలు కాముని వనితనళినీకాంత్, యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గంభీరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం శ్రీ హరిహర దేవాలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం భక్తుల కన్నుల పండువగా జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాగింది. ఈనెల 3నుంచి 9వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 7న స్వామివారి గరుడసేవ, 8న రథోత్సవం జరగనుండగా, భక్తుల సౌకర్యార్థం ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.



లింగన్నపేటలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు..

● ప్రశంసలందుకుంటున్న నర్మాల రైతు మల్లేశం

గంభీరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగులో పురుగు మందుల వాడకం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని గ్రహించాడు ఆ యువరైతు.. తనకున్న కొద్దిపాటి భూమిలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తూ.. మార్కెట్ ధరకంటే తక్కువకే ప్రజలకు విక్రయించడం ద్వారా పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన యువ రైతు మల్లేశం.. కూరగాయల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నాడు.

గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన యువరైతు బొంగు మల్లేశం సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న కూరగాయలను నేరుగా ప్రజలకు విక్రయిస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. తనకున్న 10గుంటల వ్యవసాయ భూమిలో 12రకాల కూరగాయలను పండిస్తున్నాడు. బీరకాయ, బెండకాయ, కాకరకాయ. టమాట, దోసకాయ, కొత్తిమీర, గోంగూర, గోరుచిక్కుడు, చిక్కుడు, సోరకాయ, మిర్చి, మెంతికూరను సాగు చేస్తున్నాడు. ఎలాంటి రసాయన క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తున్నాడు. నర్మాలలో మార్కెట్ సదుపాయం లేకపోవడంతో ప్రజలు కూరగాయల కోసం గంభీరావుపేటకు వెళ్లాల్సి వస్తోందని గ్రహించి కూరగాయలను సొంతంగా పండిస్తూ ఊరిలోనే కూరగాయలను మార్కెట్ ధరకంటే తక్కువ ధరకే విక్రయిస్తున్నాడు.

● పవర్ వీడర్‌తో కలుపు నియంత్రణ

కూరగాయల సాగులో కలుపు నియంత్రణకు కూలీల ఖర్చు అధికమవుతుందని మల్లేశం గ్రహించాడు. కలుపు నియంత్రణకు రూ.35వేలు వెచ్చించి పవర్ వీడర్‌ను కొనుగోలు చేశాడు. దీంతో కూలీల ఖర్చు తగ్గిందని, సాగుపనుల్లో కుటుంబ సభ్యులు సహకరిస్తుండటంతో కూలీల ఖర్చులేకుండా పోయిందని మల్లేశం తెలిపాడు.



మల్లేశం సాగు చేస్తున్న కూరగాయల మొక్కలు

● మహానంది అవార్డుకు ఎంపిక..

కొన్నేళ్ళుగా తైవాన్‌జామతో పాటు కూరగాయలను నూతన పద్ధతుల్లో సాగు చేస్తుండటంతో తెలుగు వెలుగు సాహితీవేదిక ఆధ్వర్యంలో మల్లేశం మహానంది అవార్డుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహితీ ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభ కళావేదికలో ఇటీవల మల్లేశం మహానంది అవార్డును అందుకున్నాడు.

● కూరగాయల సాగుతో అదనపు ఆదాయం..
- మల్లేశం, యువరైతు, నర్మాల



సేంద్రియ పద్ధతిలో చేస్తున్న కూరగాయల సాగులో మంచి లాభాలు ఉన్నాయి. సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న కూరగాయలు రుచికరంగా ఉంటున్నాయి. కూరగాయల కోసం ఇంటి వద్దకే వచ్చి ప్రజలు నిత్యం కొనుగోలు చేస్తున్నారు. సాగు ఖర్చులు పోను నెలకు రూ.15 వేల వరకు కూరగాయల అమ్మకం ద్వారా ఆదాయం వస్తోంది.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా లక్ష్మణ్

కొడిమ్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గౌడ సంఘం అధ్యక్షుడిగా ఆదివారం గుర్రం లక్ష్మణ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గర్వందుల రాజమౌళి, కార్యదర్శిగా నేరెళ్ళ లక్ష్మన్, కోశాధికారిగా నాగుల తిరుపతి, కార్యవర్గ సభ్యులగా నాగుల చిన్న పర్షరాములు, సంపునూరి లక్ష్మీ నారాయణ, పురుషోత్తం శ్రీనివాస్, చిలువేరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను నిరాదరిస్తున్న వారసులకు కౌన్సెలింగ్ ద్వారా వృద్ధుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. నిరాదరణకు గురైన వృద్ధుల కుటుంబాలకు జిల్లా కేంద్రంలోని ఆల్ తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని పలు మండలాలకు చెందిన కుటుంబీకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా తమ పోషకుల ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాటిని తిరిగి ఆ తల్లిదండ్రుల పేరిట మార్చే అధికారం కలెక్టర్‌కు ఉంటుందని హరిఅశోక్‌కుమార్ పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌తో సంతృప్తి చెందిన వయో వృద్ధుల కుటుంబీకులు ఒప్పంద పత్రాలు రాసిచ్చి, వారిని తమ వెంట తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బీర్‌పూర్, అక్టోబరు 5: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మాటేటి చంద్రశేఖర్ శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెరుపూరి సుభాష్ యాదవ్, నాయకులు జితేందర్ యాదవ్ ఉన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతకు పదును

- 'వికసిత్ భారత్ బిల్డథాన్'కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం
- అన్ని విద్యా సంస్థల్లో అమలుకు కసరత్తు
- 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు అవకాశం
- రిజిస్ట్రేషన్‌కు ఈనెల 13 వరకు గడువు





జగిత్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సృజనాత్మకతకు మరింత పదును పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ బిల్డథాన్ 2025పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా విద్యా శాఖకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో అమలు చేయడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ బిల్డథాన్ 2025ను నిర్వహించాలని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఆదేశించారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాల ఉపాధ్యాయులు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మూడు నుంచి ఏడుగురు విద్యార్థులను గ్రూపులుగా చేసి వికసిత్ భారత్ బిల్డథాన్ పోర్టల్‌లో ఈనెల 13వ తేదీ లోగా నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రత్యక్ష సమకాలీన ఆవిష్కరణ కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి సంబంధిత థీమ్స్‌పై వివరణ, చేసే పద్ధతిపై లైవ్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించారు. పాఠశాలల్లోని ప్రముఖ ప్రదేశాలలో క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించ నున్నారు. లోగోను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విస్తృతంగా వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

లక్ష్యాలు..

- ఆత్మనిర్భర్ భారత్ స్వావలంబన వ్యవస్థలు, సాధనాలు మరియు పరిష్కారాలను నిర్మించడం
- స్వదేశీ ఆలోచనలు, జ్ఞాన వ్యవస్థలు మరియు ఆవిష్కరణలను పెంపొందించడం
- స్థానిక ఉత్పత్తులు, వనరులను ప్రోత్సహించడం
- దేశస్థిరమైన అభివృద్ధికి మార్గాలను సృష్టించడం

ఉపాధ్యాయుల పాత్ర..

- విద్యార్థి బృందాలకు మార్గదర్శకత్వం
- ఆలోచన, సమస్య పరిష్కారం, నమూనా అభివృద్ధిపై మార్గదర్శకత్వం అందించడం
- రిజిస్ట్రేషన్, సమర్పణలో సహాయం చేయడం
- పోర్టల్ రిజిస్ట్రేషన్, సమర్పణ (ఆలోచన/నమూనా) ప్రక్రియలో విద్యార్థులకు సహాయం చేయడం
- థీమ్‌లను వివరించడం, స్థానిక సమస్యలకు ప్రాధాన్యతఇవ్వడం, ఆత్మనిర్భర్ భారత్‌ను ప్రోత్సహించడం

విద్యార్థుల పాత్ర...

6 నుంచి 12 తరగతుల విద్యార్థులు 3 నుంచి 7 మంది సభ్యుల బృందంలో చేరాల్సి ఉంటుంది. ఆలోచనలకు మరియు వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధిచేయడం, నమూనాలను రూపొందించడం, విద్యార్థుల ఆలోచన యొక్క భౌతిక లేదా డిజిటల్ నమూనాను రూపొందించడానికి కలిసి పనిచేయాల్సి ఉంటుంది. సంబంధిత నమూనాకు చెందిన వీడియోను (2నిమిషాలకంటే తక్కువనిడివి) తయారు చేసి పోర్టల్‌లో సమర్పించాల్సి ఉంది.

ప్రతీ పాఠశాల నుంచి 10 బృందాలు



జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి కనీసం 50 మంది విద్యార్థులతో 10 బృందాలను ఏర్పాటు చేయాలి. ఈనెల 13లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 13న జరిగే ప్రదర్శనలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్‌ను సెల్‌నంబరు 9440212 333లో సంప్రదించాలి.

-రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

జడ్పీ పీఠంపై గురి

(మూడో పేజీ తరువాయి)

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, సుంకె రవి శంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తదితరులు ప్రత్యేకంగా సమావేశమై పార్టీ నేతలతో సమాలోచనలు జరిపినట్లు సమాచారం.

● సత్తా చాటేందుకు బీజేపీ యత్నం..

జిల్లా పరిషత్ ఎన్నికల్లో మెజార్టీ జడ్పీటీసీ స్థానాలను దక్కించుకొని జడ్పీపై జెండా ఎగురవేయడానికి కమలనాథులు ప్రయత్నాలు చేస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నేతృత్వంలో బీజేపీ నాయకులు స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని అన్ని స్థానాల నుంచి అభ్యర్థులను బరిలో నిలిపి సత్తా చాటాలని వ్యూహరచన చేస్తున్నారు. జడ్పీ పీఠంపై కన్నేసిన నేతలు ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు, ఆయా నియోజకవర్గాల నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న నేతల అండదండలను పొందడానికి, స్థానిక నాయకుల మద్దతు కూడగట్టుకోవడానికి యత్నిస్తున్నారు. సమీకరణలు ఎలా ఉన్నా జిల్లా పరిషత్ అభ్యర్థులను నిర్ణయించడంలో ఆయా పార్టీల అధినాయకత్వం పాత్ర కీలకం కానుంది.

● జనరల్ స్థానాల్లోనూ పోటీకి అతివల ఆసక్తి..

జడ్పీ చైర్మన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించడంతో అతివల్లో పోటీ అధికమైంది. జిల్లాలో మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాలతో పాటు జనరల్‌కు కేటాయించిన స్థానాల్లోనూ మహిళా అభ్యర్థులు బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలున్నాయి. ఇందులో 10 స్థానాలను ఆయా కేటగిరీలకు చెందిన మహిళలకు కేటాయించారు. ఎస్సీ మహిళకు ఎండపల్లి, మల్యాల, బీసీ మహిళకు పెగడపల్లి, జగిత్యాల, భీమారం, మేడిపల్లి, రాయికల్, జనరల్ మహిళకు బుగ్గారం, మల్లాపూర్, కథలాపూర్ రిజర్వ్ చేశారు. వీటితో పాటు ఆయా సామాజిక వర్గాల్లో జనరల్‌కు కేటాయించిన స్థానాల్లోనూ మహిళలు పోటీ చేయడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు. ఎస్టీ జనరల్‌కు కేటాయించిన బీర్‌పూర్, ఎస్సీ జనరల్‌కు కేటాయించిన కొడిమ్యాల, గొల్లపల్లి, బీసీ జనరల్‌కు కేటాయించిన కోరుట్ల, వెల్గటూరు, సారంగపూర్, మెట్‌పల్లి, జనరల్‌కు కేటాయించిన ఇబ్రహీంపట్నం, ధర్మపురి, జగిత్యాల రూరల్ మండలాల్లో సైతం మహిళలు పోటీ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా జిల్లాలో ఏ మండలం నుంచి అయిన సరే మహిళలు పోటీ చేసే అవకాశాలున్నాయి. జడ్పీ పీఠం జనరల్ మహిళకు కేటాయించడంతో ఏ సామాజిక వర్గం నుంచి గెలిచిన మహిళా అభ్యర్థి అయినా పదవిని దక్కించుకునే అవకాశాలు ఉండడంతో అతివల్లో పోటీ అధికమైంది.

ఇందిరమ్మ ఇళ్లకు 'ఉపాధి' సాయం

- 90 రోజుల పని దినాలకు అవకాశం
- ఈజీఎస్, హౌసింగ్ అధికారుల పర్యవేక్షణ

కథలాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంను అనుసంధానం చేస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో ఆర్థిక ఆసరాకు అవకాశం లభించింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మరియు ఉపాధిహామీ పథకం డైరెక్టరేట్ నుంచి తాజాగా మార్గదర్శకాలు విడుదల చేశారు. లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5లక్షలకు తోడు ఉపాధిహామీ కింద 90 పని దినాలను చేసుకునేందుకు వీలు కల్పించారు. స్వయంగా లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణంలో 90 రోజులు పని చేసుకొని ప్రభుత్వం నుంచి డబ్బులు పొందనున్నారు.

● రెండు విడతల్లో వేతనాలు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుడికి విధిగా జాబ్ కార్డు కలిగి ఉండాలనే నిబంధన విధించారు. ఈ మేరకు బేస్‌మెంట్ స్థాయిలో 40 పనిదినాలు, పైకప్పు పూర్తయిన తర్వాత 50 రోజుల నైపుణ్యం లేని కూలీ పనిదినాల వేతనాలు చెల్లిస్తారు. నైపుణ్యం లేని కూలీకి



ప్రతీ దినం రూ.307లు చెల్లిస్తారు. దీంతో లబ్ధిదారుడికి దాదాపు రూ.30 వేలు అదనంగా పొందడానికి వీలు కల్పించారు.

ఇంటి నిర్మాణ పనుల ప్రగతిని ఎంపీడీవో లేదా ఏపీవోలు పరిశీలించి టెక్నికల్ అసిస్టెంట్‌తో పరిపాలన మరియు సాంకేతిక మంజూరు ఇచ్చి హౌసింగ్ అధికారులకు పంపించాల్సి ఉంటుంది. దీంతో ఏఈ లేదా డీఈఈ సంబంధిత శాఖకు పంపి వేతనాల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. 15 రోజులకు మస్టర్లను 90 రోజులకు మించకుండా ఉపాధి అధికారులు తయారు చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో జీయో ట్యాగింగ్ చేసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మండలంలోని 19 గ్రామాల్లో 334 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో పాటు అదనంగా ఉపాధి డబ్బులు పొందనున్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఉత్తర్వులు

-శ్రీధర్, ఇన్‌చార్జి ఈసీ, కథలాపూర్



ఉపాధి హామి పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు సహాయం అందించడానికిగాను ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. మొదట కొన్ని గ్రామాలను ఎంపిక చేయగా హౌసింగ్ అధికారులతో కలిసి లబ్దిదారుల వివరాలు సేకరిస్తాం. 90 రోజుల పనిదినాలకు అంచనాలు వేసి వేతనాలు అందేలా చూస్తాం.

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి గ్రామంలో ముదిరాజ్ సంఘల అధ్వర్యంలో పెద్దమ్మ తల్లి దేవాలయ మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేములకుర్తి గ్రామ శివారులోని వేములకుర్తి బర్దిపూర్ ప్రదాన రహదారి ఎర్రబోడ ప్రాంతంలో 35 సంవత్సరాల క్రితం నిర్మించిన పెద్దమ్మ అలయం శిథిలావస్థలో ఉండగా గత సంవత్సరం గ్రామంలోని ముదిరాజ్ సంఘలు నూతన ఆలయన్ని నిర్మించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘల ఆద్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రెడ్డవెన రాజు, రెడ్డవెన గంగరాజం, లక్ష్మన్న, రెడ్డవెన తుక్కన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

-పదేళ్లుగా నామాపూర్ గ్రామస్థుల ఎదురుచూపులు

పెగడపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం నామాపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేదెన్నడో అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టగా, తలుపులు, కిటికీలు లాంటి పనులు పూర్తి చేయక అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రారంభానికి ముందే పాడుబడిన భవనంలా మారి పోయిందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిగిలిపోయిన పనులు పూర్తి చేయించి భవనాన్ని ఉపయోగంలోకి తేవాలని నామాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.



అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం

మంత్రి అడ్లూరిని కలిసిన యాదవసంఘం నాయకులు

గొల్లపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున యాదవసంఘం నాయకులు ధర్మపురి క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఆదివారం మర్యాదపూర్వకగా కలిశారు. ఈ సందర్భంగా యాదవ సమాజ అభివృద్ధికి, పశుపోషకుల సంక్షేమం, వారి అభ్యున్నతికి, సంఘం చేపట్టబోయే అభివృద్ధి పనులకు సహకరించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రాలను సమర్పించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, కొండ వెంకటేష్ గౌడ్, యాదవ సంఘం అధ్యక్షులు అంకం పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

మల్లాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని భారతీయ కిసాన్‌సంఘ్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక బయట మార్కెట్‌ల్లో రేటు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకోని మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేసి మద్ధతు ధర కల్పించి అదుకోవాలని కోరారు.

కుమ్మరిపల్లివాసికి అవార్డు

రాయికల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన పంచతి బాలరాజు ఇంటర్నేషనల్ పీస్ అవార్డును అందుకున్నాడు. బాలరాజు జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో నివసించే దాదాపు 60 నిరుపేద కుటుంబాలకు ఉదయం ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించాడు. వాట్సాప్ మాధ్యమం గ్రూప్‌లో ఉన్న సభ్యులు తమ పెళ్లి రోజుల్లో లేదా పిల్లల పుట్టిన రోజుల్లో ఉదయం ఫౌండేషన్‌కు తోచిన సహాయం అందిస్తారు. ఇలా వచ్చిన డబ్బును కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు, హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్న వారిఇ బ్లడ్ డొనేషన్, ఆర్థిక సహాయం, చదువుకోవడానికి ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఉపయోగించారని అన్నారు. ఉదయం ఫౌండేషన్ సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ పీస్ అవార్డును అందజేశారు. అవార్డు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గొల్లపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గోవిందుపల్లె శివారులోని శ్రీరాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పూర్తి అయి 25 వసంతాలు పూర్తి అయిన సందర్భంను పురస్కరించుకొని వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులు ఆనాటి తీపి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న సందర్భంగా క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం కొద్దిసేపు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరేత్తించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'శివాజీ ఆశయ సాధనకు కృషి'

పెగడపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : చత్రపతి శివాజీ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శివాజీ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శివాజీ విగ్రహం ఏర్పాటు కోసం ఆదివారం నూతనంగా కమిటీని ఎన్నుకున్నారు. విగ్రహ కమిటీ అధ్యక్షులుగా ఉయ్యాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఉల్లెందుల రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా నేదరి సాయికృష్ణ, పాదం కార్తీక్, కల్లెపల్లి సుధాకర్, మాధారపు కార్తీక్ రావు, కోశాదికారిగా గంగ సాగర్, సహాయ కార్యదర్శిగా బండారి అఖిల్, కన్నం పవన్ , సాయికృష్ణ, నరేష్, ప్రచార కార్యదర్శులుగా బోగ లతీష్, సంధవేని నవీన్, బైర కమలాకర్, విక్రమ్‌లను ఎన్నుకున్నారు.

దసరా వేడుకలు

మల్యాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం కులసంఘాల ఆధ్వర్యంలో దసరా వేడుకలు నిర్వహించారు. ప్రతి ఏటా దసరా రోజు గ్రామంలో గల గడి వద్ద పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి దసరా గాంధీ జయంతి రోజు రావడంతో గుమ్మడి కాయతో వేడుకలు జరిపారు. ఆదివారం గ్రామ సుభిక్షం కోసం మరో సారి గడి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు.

జిల్లాలో భారీ వర్షం

- పలు చోట్ల నేలవాలిన వరి
-ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో ఆదివారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఎండపల్లిలో 83.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మల్యాల మండలం మద్దుట్లలో 67.3మిల్లీమీటర్లు, ఎండపల్లి మండలం గుల్లకోటలో 47.3, బుగ్గారం మండలం సిరికొండలో 46.3, వెల్గటూర్ మండలంలో 38.3, మల్యాల మండలంలో 34.8మిమి, కొడిమ్యాల మండలం పూడూర్‌లో 23.3, ధర్మపురి మండలం జైనాలో 18.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

●ఎండపల్లి: ఎండపల్లి మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం అకాల వర్షం కురిసింది. అకాల వర్షానికి వరి పంట నేలకొరింది. మరో ఇరవై రోజుల్లో పంట చేతికచ్చే సమయంలో వర్షాలు కురుస్తున్నాయి. ఒకవైపు ప్రారంభం నుంచే తెగుళ్ళతోనే పంట ఖర్చు ఎక్కువైందని రైతులు దిగాలు చెందుతున్నారు. మారేడుపల్లి గ్రామంలో దాసరి చంద్రయ్య తన కున్న రెండు ఎకరాలు పూర్తిగా కింద పడిపోయింది. పంట కోయడం ఇబ్బందిగా మారిందని పెట్టుబడులు ఎక్కువ కావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. కౌలుకు తీసుకుని పంటలను సాగు చేస్తే వర్షంతో పంట కోల్పోయామని రైతులు కన్నీరు పెడుతున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

●వెల్గటూర్: వెల్గటూర్‌లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కుమ్మరిపల్లి మోడల్ స్కూల్ ముందర కాలువను తలపించేలా రోడ్డు పైనుండి వరద పారింది. గ్రామం లోకి వెళ్లే రోడ్డు పైనుండి వరద పారడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారు. కాగా వరి పొట్ట దశకు వస్తున్న సమయంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జగిత్యాల-వెల్గటూర్ రోడ్డు నుంచి వెంకటాపూర్‌కు రోడ్డు నిర్మాణంలో భాగంగా మొరం పోయడంతో వర్షానికి రోడ్డు బురదమయంగా మారి పాదచారులు, వాహన దారులు ఇబ్బంది పడ్డారు.




ఎండపల్లి మండలం మారేడుపల్లిలో నేలకొరిగిన వరి, మల్లాపూర్ మండలంలో దెబ్బతిన్న పసుపు పంట

అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలు

మల్లాపూర్: ఇటీవల కురిసిన అధిక వర్షాలు అన్నదాతను తీవ్రంగా దెబ్బతీసింది. వర్షాలకు పంట భూముల్లో అధిక నీరు చేరి వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. మొక్క జొన్న, పసుపు, వరి కూరగాయాలు తదితర పలు పంటలు దెబ్బతిన్నాయి. గోదావరి పరివాహక ప్రాంతాలలో వరద నీటిలో పలు పంటలు మునిగి పోయాయి. మండలంలో సాగు అవుతున్న ప్రధాన వాణిజ్య పంట అయిన పసుపును అధిక వర్షాలు కురిసి దెబ్బ తీసాయి. ప్రతి యోటా అంతర పంటగా మొక్క జొన్న, పసుపును రైతులు సాగు చేస్తారు. ఈ యేడు మొక్కజొన్నను కోసిన రైతులు పసుపు దిగుబడిపై దృష్టి సారించారు. అధిక వర్షాభావ పరిస్థితులతో పసుపును మర్రకు తెగులు, మొగి రోగం ఆశించడంతో సాగు పెట్టుబడులు మరింత పెరిగి రైతన్న దిగులు చెందుతున్నాడు. ఉద్యాయన అధికారులు క్షేత్ర స్థాయిలో పసుపు పంటను పరిశీలించి దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులకు సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మపురి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్‌రావు ఆదివారం ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన నల్ల శేఖర్ కూతురు ఇటీవల అనారోగ్యానికి గురి కాగా విషయం తెలుసుకున్న రాంసుధాకర్‌రావు వైద్య పరీక్షల కోసం రూ 5,000 ఆర్థికసాయం అందించారు. పేద కుటుంబానికి ఆర్థికసాయం అందించిన రాంసుధాకర్‌రావుకు ఆ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, కామెర ప్రభాకర్, గడ్డం శంకర్ తదితరులు పాల్గొన్నార.

క్రీడలతో మానసికోల్లాసం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 5 : మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రయోగ ఇల్లు 4వ వార్షికోత్సవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కంపెల్లి కిరణ్ స్మారకార్థం చెస్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెస్ ఆటలు ఆడడం వలన జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంచుతాయన్నారు.

'పక్కా ప్రణాళికతో బీజేపీ అభ్యర్థుల గెలుపు'

కథలాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజుల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పక్కా ప్రణాళిక అనుసరించి బీజేపీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముఖ్య నేతలతో సన్నాహక సమావేశంకు హాజరై మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేశ్, సీనియర్ నాయకుడు పిడుగు ప్రతాప్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటస్వామి జయంతి వేడుకలు



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, కస్తూరి శ్రీనివాస్, సంగనభట్ల నరేందర్, జంగిలి ప్రభాకర్, ఎండీ రఫియొద్దీన్, రాందేని మొగిలి పాల్గొన్నారు.

●పెగడపల్లి: వెంకటస్వామి జయంతి ఉత్సవాలను పెగడపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, నాయకులు పవన్ రెడ్డి, వంశీదర్ రావు, శ్యాంసుందర్ రెడ్డి, రమేష్, జలపతి, నీరట్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

●వెల్గటూర్: పెద్దపల్లి మాజీ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) సేవలు చిర స్మరణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రం లోని అంబేడ్కర్ చౌక్ వద్ద కాకా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వెంకటస్వామి బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్, శ్రీకాంత్‌రావు, సందీప్‌రెడ్డి, మంజుల పాల్గొన్నారు.